## ఆర్టిఫిషియల్ బోధన ప్రారంభం



ఏఐ బోధనను ప్రారంభిస్తున్న డీఈవో పాణిని

ములుగురూరల్/తాడ్వాయి, మార్చి 28 : మండలంలోని పత్తిపల్లి ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఆధారిత విద్యా బోధన(ఏఐ)ను డీఈవో పాణిని ఏపీపీ చైర్మన్ చిర్ర సమత, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ప్రేమలతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐని ఉపయోగించి విద్యార్థుల స్వీయ అభ్యసన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి తగిన ప్రోత్సాహం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హెచ్ఎంలు శివప్రసాద్, నందకిశోర్, ఉపాధ్యాయులు రవి, మురళి, శ్రీనివాస్, నర్సింహాచారి, శివరాం, రజిత, రమణ, డీఆర్పీ మధు పాల్గొన్నారు. అలాగే తాడ్వాయి మండలం బీరెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష కో క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి ప్రారంభించారు. హెచ్ఎం నందకిశోర్, హెచ్ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పులి జాడ కోసం సెర్చింగ్ : 10 కెమెరా ట్రాప్‌ల ఏర్పాటు

ములుగురూరల్, మార్చి 28 : ములుగు మండలం అంకన్నగూడెం-సర్వాపురం గ్రామాల అటవీ ప్రాంతంలోకి గురువారం పెద్దపులి ప్రవేశించింది. ఎఫ్ఆర్వో డోలి శంకర్ ఆధ్వర్యంలో ఫారెస్టు సిబ్బంది పాద ముద్రల ఆధారంగా పులి సంచారాన్ని నిర్ధారించారు. శుక్రవారం సైతం అటవీ ప్రాంతంలో అధికారులు పులి జాడ కోసం సెర్చింగ్ చేశారు. ఈ మేరకు అంకన్నగూడెం, సర్వాపురం, పెదగలపల్లి, జగ్గన్నగూడెం-కొత్తగూడ వైపు అటవీ ప్రాంతంలో 10 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. పులి మేటింగ్ కోసం అటవీ ప్రాంతం గుండా ప్రయాణం చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం కొత్తగూడ వైపు సైతం పులి వెళ్లలేదని, అక్కడి అధికారులు దాని జాడ కోసం చూస్తున్నట్లు ఎఫ్ఆర్వో స్పష్టం చేశారు. పులి ములుగు మండల అటవీ ప్రాంతంలో ఉందా? లేక గోవిందరావుపేట మండలం గుండ్లవాగు అటవీ ప్రాంతం వైపు వెళ్లిందా అనేది తెలియాల్సి ఉందని అన్నారు. పాద ముద్రల ఆధారంగా సిబ్బంది సెర్చింగ్ చేస్తున్నారని, అడవిలో కొంత దూరం వెళ్లిన అనంతరం చెత్తచెదారం కారణంగా పాద ముద్రలు కనిపించలేదని తెలిపారు. అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో బయటకు రావొద్దని ఆయన సూచించారు. పులి కనిపిస్తే హాని తలపెట్టొద్దని, ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కదలికను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

## ఆర్మీకి పంకెన గ్రామం నుంచి తొలి యువకుడి ఎంపిక



పలిమెల, మార్చి 28 : మండలంలోని పంకెన గ్రామానికి చెందిన బొచ్చు రాకేశ్ ఇటీవల ప్రకటించిన అగ్నివీర్ ఆర్మీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి మెరిట్ లిస్టులో ఆర్మీ జనరల్ డ్యూటీ కేటగిరీలో ఎంపికయ్యాడు. గ్రామం నుంచి మొదటి జవాన్ కావడం విశేషం. రాకేశ్ ప్రస్తుతం హనుమకొండలోని వాగ్దేవి కాలేజీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఎన్ సీసీలో శిక్షణ పొందాడు. తల్లి దండ్రులు లక్ష్మయ్య- పుష్పలత వ్యవసాయదారులని, వారి కృషి వల్లే తాను ఆర్మీకి ఎంపిక అయ్యానని రాకకేశ్ తెలిపారు. తన విజయానికి సహకరించిన అన్నయ్య శ్రీకాంత్, మిత్రులు, గురువులకు రాకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు కుటుంబానికి రూ.25వేల చెక్కు అందజేత

వెంకటాపురం(నూగూరు), మార్చి 28 : మండలంలోని చిరుతపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మక్కజొన్న రైతులు లేక మధుకృష్ణ, చంద్రర్‌రావు కుటుంబాలకు శుక్రవారం రూ.25వేల చొప్పులను తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అందజేశారు. ఏటూరునాగారం ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కులను ఆర్థిక సాయంగా అందించినట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ మహేందర్ ఉన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రేగొండ, మార్చి 28 : మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన పోలవేని సంగీత్ (25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగీత్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతడు కారు కొని ఇవ్వాలని తండ్రి విజేందర్‌ను అడుగగా డబ్బులు లేవని తెలుపడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉరేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి విజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
I KOMPELLI NIHARIKA (New Name) Resident of H.No: 3-142, Bayyaram (V &Mdl) Mahabubabad Dist-507211, Telangana. T.G. Have changed my name from PAKHALA NIHARIKA D/o RAVI W/o KOMPELLI BHARATH, to KOMPELLI NIHARIKA for all purposes.

**CHANGE OF NAME**
I, MADDELA JAYAPRAKASH, S/o. MADDELA SHANKAR RAO, Aged 45 years, , R/o. H.No. 2-8-14, GMR Amrit, Flat No. 101, Waddepally, Hanamkonda Mandal, Hanumakonda Dist. My son name Changed from MADDELA ROHAN S/o MADDELA JAYAPRAKASH to MADDELA THAMAN S/o MADDELA JAYAPRAKASH. for all purposes.

**CHANGE OF NAME**
★I, MANCHANA RANI W/o MANCHANA CHANDRAKANTH,(OLD NAME) R/o H.no.8-9-174, OPP:Jubliee Society Apartments. Station Road Warangal, PolavariStreet, Warangal, Dist: Warangal Urban, Telangana : 506002, have changed my name as MANCHANA SWARUPA RANI W/O MANCHANA CHANDRAKANTH (NEW NAME) for all purposes.
NTW-17545

**PLOT FOR SALE**



★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# ముక్కుపుటాలు అదురుతున్నయ్!

- గూడెపల్లెలో లోపించిన పారిశుధ్యం
- కాలువల్లో పేరుకుపోయిన చెత్త

రేగొండ, మార్చి 28 : మండలంలోని గూడెపల్లెలో మురుగు కాలువలు నిండి దుర్గంధం వెదజల్లుతున్నది. పట్టించుకోవాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. గొల్లవాడలోని సైడ్ కాలువలో నీరు బయటకు పోకుండా ఆ కాలనీ వాసి బాపురావు ఇంటి సమీపంలో బండలు అడ్డుపెట్టాడు. దీనికి తోడు కాల్వలో చెత్త చెదారం, మట్టి పేరుకపోయి సమస్య మరింత జఠిలంగా మారింది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం బ్లీచింగ్ ఫౌడర్ చల్లకపోవడంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో పల్లె ప్రగతి నిధులతో గ్రామాన్ని శుభ్రంగా ఉంచేవారని పలువురు గ్రామస్తులు వాపోయారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోడంతో పారిశుధ్యం పడకేసిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ కార్యదర్శి, ప్రత్యేకాధికారి స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు

### రోగాలు వచ్చి ఆర్థికంగా నష్టపోయినం

– నూకల మల్లమ్మ, గూడెపల్లె



సైడు కాల్వలు, పారిశుధ్య పనులు చేయకపోవడంతో దుర్గం ధం, దోమలు, ఈగలతో అంటు వ్యాధులు, డెంగీ, మలేరియా జ్వరాలు వస్తున్నయ్. నేను, నా భర్త వ్యాధుల బారిన పడి రెండు నెలలు దవాఖానలకు తిరిగాం. వైద్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయాం. మా ఇంటి పక్కనే కాల్వ ఉండడంతో వాసనకు ఇంట్లో ఉండలేకపోతున్నం. ఎవరికి చెప్పినా పట్టించుకోడంలేదు. జిల్లా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపించాలి.

### గొడవలతో కాల్వలను శుభ్రం చేయడంలేదు

– మౌనిక, గ్రామ కార్యదర్శి

డ్రైనేజీలో సీల్ట్ పేరుకుపోయిన విషయం వాస్తవమే. అన్నదమ్మల గొడవల కారణంగా కాల్వను శుభ్రం చేయడం లేదు. తమ సిబ్బంది శుభ్రం చేయడానికి వెళ్తే వారు గొడవకు దిగుతున్నారు. దీంతో మేం అక్కడికి వెళ్లి ఏం చేయలేకపోతున్నం.

## ఇఫ్తార్ విందులతో పెంపొందనున్న స్నేహ బంధం

**బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి**



మాట్లాడుతున్న కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, మార్చి 28 : ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య స్నేహ బంధాలను పెంపొందిస్తాయని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలకేంద్రంలోని మసీదులో శుక్రవారం రాత్రి ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విందులో పాల్గొన్న ఆయన ముస్లింలకు కాకులమర్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై తాజుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ఖాజాపాషా, ప్రదీప్‌కుమార్, గోవింద్‌నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఎండీ వలీబాబా, నూతి కృష్ణమూర్తి, అజ్మత్‌ఖాన్, కుమ్మరి చంద్రబాబు, కావేరి చిన్నికృష్ణ, జాడి బోజరావు, పర్వతాల ఎల్లయ్య, మందపల్లి చంద్రం, దడిగల లక్ష్మణ్, కొండాయి చిన్ని, శ్రీరాములు, ఖలీల్, చిప్ప నాగరాజు, బూర వెంకన్న, గండపెల్లి నర్సయ్య, మహమూద్, ఎజాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే, పక్కన ఎమ్మెల్యే సత్యనారాయణరావు

## సద్గుణాలు పెంపొందించడమే రంజాన్ ఉద్దేశం

**ఎమ్మెల్యే జీఎస్ఆర్, ఎస్పీ కిరణ్‌ఖరే**

గణపురం, మార్చి 28 : మనుషుల్లో సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ మాస ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. శుక్రవారం గణపురం మండలం చెల్పూర్‌లో, జిల్లా పోలీస్ కార్యాలయంలో పట్టణ ముస్లిం పెద్దలు, పోలీస్ ముస్లిం ఉద్యోగులకు ఎస్పీ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం కలయికే రంజాన్ మాసం అన్నారు. రంజాన్ మాసం అందరిలో సోదర భావం పెంపొందిస్తుందని, ఈ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో గణపురం తహసీల్దార్ మధురకవి, ఎంపీఐ సందాని, సత్యనారాయణస్వామి, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్, చెల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ కావటి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్ రెడ్డి, డీటీవో సందాని, సీఐలు, ఎస్సైలు, పట్టణ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగురూరల్/ ఏటూరునాగారం, మహదేవపూర్, మార్చి 28 : ములుగు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్, ఏటూరునాగారం గ్రామ పంచాయతీ, మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ములుగులో టీఎన్జీవోస్ జిల్లా అధక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా టీజీవో అధక్షుడు, అదనపు కలెక్టర్ సంపత్‌రావు హాజరై ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ ములుగు జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, వైస్ ప్రెసిడెంట్ కే సరిత, శ్రీనివాస్, ప్రదీప్, జాయింట్ సెక్రటరీ శ్రీవాణి, బీ శ్రీధర్‌రావు, పంచాయతీ సెక్రటరీ ఫోరం అధ్యక్షుడు పిట్టల రవి, ఏటూరునాగారం యూనియన్ కార్యదర్శి బీ అశోక్, కవిత, సామ్యారెడ్డి, జయ రజిని, శిల్పా తేజస్విని, ఓదెమ్మ, సరోజ, ప్రియదర్శిని, పరంసింగ్, చంద్రశేఖర్, ధీరజ్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు. 30న ఆదివారం కావడంతో శుక్రవారం శుభదినంగా భావిస్తూ ఏటూరునాగారం గ్రామ పంచాయతీలో అధికారులు వేడుకలు చేపట్టారు. కుండలో ఉగాది పచ్చడి తయారు చేసి కార్యాలయానికి వచ్చిన వారందరికీ అందచేశారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో కళాశాలలో మామిడి తోరణాలతో అలంకరించి షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి ఆరగించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ డీ శ్రీనివాస్, డాక్టర్ రజిత, మున్నయ్య, పరశురాములు, రాజేందర్, రమేశ్, రవీందర్, మాధురి, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

మొగుళ్లపల్లి, మార్చి 28 : మండలంలోని మొగుళ్లపల్లి, మొట్లపల్లి ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఈవో ముద్దమల్ల రాజేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్ అధికారులకు పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్లో భద్రపరిచిన పరీక్ష పత్రాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని ముల్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన తో జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ**

ములుగురూరల్, మార్చి 28 : జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరుకుండా నివారణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్‌తో కలిసి రోడ్డు సేఫ్టీపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీస్, రోడ్డు, భవనాలు, ఎక్సైజ్, ఆర్టీవో, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున బ్లాక్ స్పాట్స్ వద్ద చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేగాన్ని తగ్గించే నివారణ చర్యలు ఏమైనా ఉంటే వాటిని అభివృద్ధి చేయాలని సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## పస్రా ఎస్సైకి సన్మానం

గోవిందరావుపేట, మార్చి 28 : పస్రా ఎస్సై అచ్చ కమలాకర్‌ను శుక్రవారం బీఎస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఎస్పీ శబరీశ్ చేతుల మీదుగా ఉత్తమ ఎస్సైగా ప్రశంసా పత్రం అందుకోగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కడప రాజశేఖర్‌వర్మ, జిల్లా ఇన్‌చార్జి పసులాది ముకేశ్‌తో పాటు పలువురు కలిసి ఎస్సైని ఘనంగా సత్కరించారు. బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు కోకిల అజయ్‌కుమార్, నాయకులు గంగవేని మణికాంత్, బాలూనాయక్, ఏలియా పాల్గొన్నారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు

కాటారం, మార్చి 28 : కౌలు రైతుల ఎక్స్‌గ్రేషియా పంపిణీ జాబితాలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని హైదరాబాద్‌లోని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలకేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు శుక్రవారం తెలిపారు. తన తండ్రి మల్లయ్య కౌలుకు భూమిని తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడని, పంటలో నష్టంతో ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా గత ప్రభుత్వ హయాంలో ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. కాగా, ప్రభుత్వం నుంచి మంజూరైన 16 మందితో కూడిన జాబితాలో మల్లయ్య పేరు ఉండగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో తమ పేరు లేదని ఆరోపించారు. దీనిపై ప్రజావాణిలో కలెక్టర్‌ను అడిగితే తమపై దురుసుగా ప్రవర్తించి అసహనం వ్యక్తం చేశారని ఆరోపించారు. ఫిర్యాదు మేరకు స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ 15 రోజుల్లో పూర్తి స్థాయి సమగ్ర నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ నోటీసు ఇచ్చినట్లు రాజబాబు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జక్కు శ్రావణ్, రామిళ్ల కిరణ్ ఉన్నారు.

## ముగిసిన చెల్పూర్ అంగడి వేలం

గణపురం, మార్చి 28 : మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ తైబజార్ వేలం పాట శుక్రవారం డీఎల్పీవో వీరభద్రం ఆధ్వర్యంలో ముగిసింది. ప్రతి బుధవారం గ్రామంలో నిర్వహించే వారాంతపు సంతకు గురువారం వేలం నిర్వహించగా వాయిదా పడిన విషయం విధితమే. శుక్రవారం మొత్తం ముగ్గురు డిపాజిటర్లు పాల్గొనగా బత్తిని శివశంకర్ రూ 2,20,200 వేలం దక్కించుకున్నారు. ఒక సంవత్సరం మాత్రమే గడువుంటుందని, జీపీ నిబంధనలు పాటించాలని వేలం దక్కించుకున్న వారికి డీఎల్పీవో సూచించారు. స్పెషల్ ఆఫీసర్ సూరం బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్ పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

టేకుమట్ల, మార్చి 28 : వరి పొలంలో వరికి బదులు తెల్ల బొంత గడ్డి పెరిగిందని రైతు ఫిర్యాదు చేయగా, వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం సందర్శించి శాంపిల్స్ సేకరించినట్లు ఏవో కళ్యాణి తెలిపారు. రామకృష్ణపూర్ (టీ) గ్రామానికి చెందిన కసరవేన కుమార్ ఎకరం భూమిలో స్థానిక ఫర్టిలైజర్ షాపులో 1010 రకాన్ని కొనుగోలు చేసి సాగుచేశాడు. పొలంలో వరి గొలుసుకు బదులు తెల్ల బొంతు గడ్డి ఎక్కువగా ఉందని రైతు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ విశ్వతేజ, మండల వ్యవసాయాధికారి కళ్యాణి, వ్యవసాయ విస్తరణ అధికారి రాహుల్, రైతు కుమార్‌తో కలిసి పంటను పరిశీలించారు. వారి రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఏవో తెలిపారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కృష్ణకాలనీ, మార్చి 28 : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి తహసీల్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ప్రజా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేసి రాజీవ్ యువ వికాసం పథకాన్ని యాథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి నంబర్లను మంజూరు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా గుడిసె వాసులకు తాగునీరు అందించి, మౌలిక వసలు కల్పించాలన్నారు. నాయకులు నేరెళ్ల జోసెఫ్, గడ్డం సింహాద్రి, ఎండీ యాకూబ్ పాషా, పీక రవి, గోనెల తిరుపతి పాల్గొన్నారు.

## సకాలంలో సన్న బియ్యం రేషన్ షాపులకు చేరాలి

చిట్యాల, మార్చి 28 : సకాలంలో సన్న బియ్యం రేషన్ షాపులకు చేరేలా కృషిచేయాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పెరుమాండ్ల రాములు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదామును తనిఖీ చేశారు. ఈ గోదాము ద్వారా ఆరు మండలాలకు 176 రేషన్ షాపుల ద్వారా 14,843 క్వింటాళ్ల బియ్యం ప్రతి నెల సరఫరా అవుతుందని చెప్పారు. కాగా, 110 రేషన్ షాపులకు మాత్రమే సన్న బియ్యం సరఫరా అయిందని, మిగతా షాపులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని గోదాం ఇన్‌చార్జి గంగాధర రాజును ఆదేశించారు. ఆయన వెంట ఏసీఎస్‌వో వేణు, సిబ్బంది ఉన్నారు.

## కార్డుదారుల నుంచి ఫిర్యాదుల రావొద్దు

కాటారం, మార్చి 28 : రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని, కార్డుదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తహసీల్దార్ నాగరాజు రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం తహసీల్‌లో ఆయన డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పీడీఎస్ బియ్యం పంపిణీపై చర్చించారు. డీలర్లు షెడ్యూల్ ప్రకారం రేషన్ దుకాణాలను నిర్వహించాలన్నారు. షాపు బోర్డు టైం టేబుల్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న పాల్గొన్నారు.

## వైద్యసేవలపై అవగాహన సదస్సు

మొగుళ్లపల్లి, మార్చి 28 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు వైద్యసేవలపై వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్ హాజరై వేసవిలో వడదెబ్బ వల్ల వచ్చే వ్యాధులు, వాటి బారీన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు వివరించాలని సూచించారు.

## రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలి

ములుగురూరల్, మార్చి 28 : అదపలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా రవిచందర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ హాజరై ప్రారంభించారు. తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో ఎంజీఎం వారు 148, రెడ్ క్రాస్ వారు 132 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు లయన్స్‌క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పండ్లు, మంచినీటిని అందజేశారు. 39 సీఆర్పీఎఫ్ బెటాలియన్ పోలీసులు, టీజీవో, టీఎన్జీవో, ఉపాధ్యాయ సంఘాలు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, ప్రభుత్వ దవాఖాన సిబ్బంది, పోలీస్ శాఖలతో పాటు వివిధ సంఘాలు వారు పాల్గొన్నారు.

## దేవాదుల నాలుగు మోటర్లు బంద్

కన్నాయిగూడెం, మార్చి 28 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఆరు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతుండగా శుక్రవారం నాలుగు మోటర్లను బంద్ చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఫేస్-2 లోని రెండు, ఫేస్-3లోని రెండు మోటర్లను బంద్ చేశారు. ఫేస్-3 లోని రెండు మోటర్లతో రోజుకు 583 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. ఇప్పటివరకు దేవాదుల ఎత్తిపోతల మోటర్ల ద్వారా 15.783 టీఎంసీల గోదావరి నీటిని తరలించినట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఇసుక లారీ

వెంకటాపురం(నూగూరు), మార్చి 28 : ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొట్టిన సంఘటన కొండాపురం శివారులో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వెంకటాపురం మండలకేంద్రానికి వస్తున్న ఆర్టీసీ బస్సును కొండాపురం గ్రామ సమీపంలో చర్ల మండలం నుంచి వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ఉన్న ఓ మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ప్రయాణిల సహాయంతో మామూలు స్థితికి వచ్చింది.

## నష్టపరిహారంపై నేడు సమావేశం

ములుగురూరల్, మార్చి 28 : కలెక్టరేట్‌లో వివిధ విత్తన కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించి నష్టపరిహారం విలువను నిర్ధారించి రైతులకు వేరుగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. ఈ నెల 25న రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నిర్వహించిన సమావేశంలో చేసిన సూచనల మేరకు ఇటీవల కన్నాయిగూడెం మండలానికి చెందిన రైతు ఆత్మహత్య చేసుకోగా సత్వర ఆర్థిక సాయం కింద ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.25 వేలు, ఎన్ఎఫ్‌బీఎస్ స్కీమ్ కింద రూ.20వేల ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. అలాగే అతని పిల్లలను లక్ష్మీనగర్ ఏహెచ్ఎస్ బాయ్స్, చిరుతపల్లి టీడబ్ల్యూపీఎస్‌లో అడ్మిషన్ చేయించినట్లు తెలిపారు. కుమార్తెను అంగన్‌వాడీలో చేర్పించామన్నారు. పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని నేడు నిర్ధారించనున్నట్లు చెప్పారు.

## ఏటూరునాగారం జీపీ తై బజార్ వేలం

ఏటూరునాగారం, మార్చి 28 : స్థానిక గ్రామ పంచాయతీ తైబజార్ వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. గంప చిట్టి, కమేళా పాటను వేర్వేరుగా నిర్వహించారు. మొత్తం రూ. 3.40 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. రూ. 2.50 లక్షలకు మండలకేంద్రానికి చెందిన కూరుకు హరికృష్ణ గంప చిట్టీ దక్కించుకున్నారు. గత ఏడాది రూ.1.65 లక్షలకు దక్కించుకోగా ఈసారి రూ.85వేలు ఎక్కువగా పలికింది. కమేళాను మరో వ్యక్తి రూ.90 వేలకు దక్కించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి దీని నిర్వహణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వ్యాపారులు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు అధ్యాపకుల ప్రచారం

గోవిందరావుపేట, మార్చి 28 : ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు దోస్త్ కోఆర్డినేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అధ్యాపకులు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. అధ్యాపక బృందం శంకర్, సోమన్న, ఐలయ్య ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల ఇంటికి వెళ్లి తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. ప్రైవేట్‌కు ధీటు గా బోధన ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రామప్ప హుండీ ఆదాయం రూ.4.47 లక్షలు

వెంకటాపూర్, మార్చి : రామప్ప దేవాలయ హుండీ ఆదాయం రూ.4,47,784 వచ్చినట్లు ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆలయ మండపంలో దేవాదాయ శాఖ పరిశీలకులు నందనం కవిత, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించగా నోట్ల రూపంలో రూ.4,07,670, నాణేల ద్వారా రూ.40,114 వచ్చాయన్నారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాశ్‌రెడ్డి, మార్క సంతోష్, గుడిమల్ల సంతోష్, దామోదర్, రత్నకుమారి, టూరిజం, కేంద్ర పురావస్తు, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అడవి కర్ర పట్టివేత

ములుగురూరల్, మార్చి 28 : అడవిలో కర్రలను నరికి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్టు అధికారులు శుక్రవారం ఉదయం ఇంచర్ల వద్ద పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. మొబైల్ పార్టీ ఎఫ్ఆర్వో శ్రావణి ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం వెంకటాపూర్ మండలం పస్రా రేంజ్ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా బిల్లుడు, నల్ల మద్ది కర్రలను సెంట్రింగ్ పని నిమిత్తం కొట్టుకొని ట్రాక్టర్‌లో మల్లంపల్లికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కర్రతో పాటు ట్రాక్టర్‌ను ములుగు ఫారెస్టు కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు.

## ప్రజల గోస పట్టని కాంగ్రెస్

గణపురం, మార్చి 28 : ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలల కావస్తున్నా 6 గ్యారంటీల అమలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు శిశిధర్‌రెడ్డి, నాయకులు మంద మహేశ్, సోమ దామోదర్, మాదాసు మొగిలి పాల్గొన్నారు.

## గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

చిట్యాల, మార్చి 28 : గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ప్రోహిబిషన్, ఎక్సైజ్ సీఐ రమ్య అన్నారు. గుడుంబా నిర్మూలనపై నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం చిట్యాల మండలం పాశిగడ్డతండా, అందుకుతండా, లక్ష్మీపురంతండా గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబా, 40 కిలోల చక్కెర, 5 కిలోల పటికను స్వాధీనం చేసుకొని, 1,400 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం చేశారు. నలుగురిపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ఎస్సైలు రబ్బానీ, శిరీషారెడ్డి పాల్గొన్నారు.

## బోరు పనులను ప్రారంభించిన మాజీ కౌన్సిలర్

కృష్ణకాలనీ, మార్చి 28: మున్సిపల్ పరిధి 6వ వార్డు కృష్ణకాలనీలోని ఓపెన్ జిమ్ పార్కులో పార్కుకు, భద్రకాళి లైన్ ప్రజల కోసం 6వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎడ్ల మౌనికా శ్రీనివాస్ మూడు నెలల క్రితం నూతన బోరును మంజూరు చేపించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు పనులను ప్రారంభించారు.

## పాత్రాపురంలో పశువైద్య శిబిరం

వెంకటాపురం(నూగూరు), మార్చి 28 : మండలంలోని పాత్రాపురం గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేయగా చైర్మన్ ఇర్పా శ్రీను ప్రారంభించారు. రైతులు, పశువుల యజమానులు పశువుల సంరక్షణ నిమిత్తం శిబిరాలను వినియోగించుకోవాలని సూచించా రు. అనంతరం గ్రామంలో పశు వైద్యాధికారులు హరీశ్‌రెడ్డి, హరీశ్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, ఏడీఏ వేణు పాల్గొన్నారు.

## వాడగూడెంలో పెసా గ్రామసభ

మంగపేట, మార్చి 28 : మండలంలోని వాడగూడెంలో శుక్రవారం పెసా గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో బద్రు, ఐటీడీఏ పెసా కో ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ హాజరు కాగా, 205 మంది గిరిజనులు సభలో పాల్గొన్నారు. నల్లపోచమ్మ గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో సమీప గోదావరి తీరంలో ఇసుక క్వారీ నిర్వహణ మీకు ఆమోదమేనా అని అధికారులు ప్రశ్నించగా, వీరిలో 114 మంది గిరిజనులు చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. గ్రామ సభలో ఎంపీవో మమత, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.